క్లుప్తంగా

మొక్కజొన్న సాగు చేపట్టాలి

ఏఓ శివశంకర్



చాట్రాయి: వరి కోతలు కోసిన భూములను దున్నకుండా మొక్కజొన్న విత్తుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని చాట్రాయిలో మొక్కజొన్న సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విధంగా విత్తడం ద్వారా సాగు ఖర్చులు రూ.4 వేలు కలిసి వస్తాయన్నారు. విత్తడానికి ముందు వ్యవసాయాధికారులు నిర్దేశించిన మందులతో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా 20 రోజుల వరకు ఎటువంటి పురుగు ఆశించదని చెప్పారు. కలుపు మందు ఎక్కువగా వాడడం వల్ల భూమి సహసతత్వాన్ని కోల్పోయి దిగుబడి తగ్గుతుందన్నారు. సాగుకు సేంద్రియ ఎరువులను వినియోగించాలని ఆయన సూచించారు.

ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం



మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహ మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామికి 108 అష్టోత్తర శత కలశాభిషేకం కనులవిందుగా జరిగింది. విఘ్నేశ్వర పూజతో మూడో రోజు కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయాచార్యులు ప్రారంభించారు. స్వామికి ప్రత్యేక ఆలంకరణ చేసి విశేష పూజలు చేశారు. గీతా జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

విస్సన్నపేట: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద నోటీస్ బోర్డులో 13 (ఎ), 3(ఎ)ఫారంలు పెట్టామని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి బుధవారం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయం, సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఫారంలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని, ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఆలయాల్లో సామూహిక హారతి



గంపలగూడెం: హైందవ సంఘం పిలుపు మేరజనవరి ఐదో తేదీన నిర్వహించనున్న శంఖారావం సభ విజయవంతం కోరుతూ మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం సామూహిక హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ముందుగా మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా నగర సంకీర్తన, శ్రీమద్ భగవద్గీత 18 అధ్యాయాల పఠనం, విష్ణు సహస్రనామం, శరణాగతి గద్యము, వైకుంఠ గద్యము, శ్రీరంగ గద్యపఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం హైందవ శంఖారావం సభకు మద్దతుగా సామూహిక హారతులు జరిపారు. భక్తులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ రాంబాబుకు డాక్టరేట్



విస్సన్నపేట: పుట్రేల పంచాయతీ జానలగడ్డకు చెందిన దారా రాంబాబు కర్నూలులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం) నుంచి డాక్టరేట్ అందుకున్నారు. కాకినాడ ఆదిత్య యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రాంబాబు విధులు నిర్వహిస్తున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పుల్లారావు పర్యవేక్షణలో సోలార్ ఎనర్జీపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌ను బుధవారం అందుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందాలి



ఆగిరిపల్లి: ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కృష్ణా జిల్లా విద్యా శాఖాధికారి పీవీ జె.రామారావు సూచించారు. తోటపల్లి హిల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఏఎంఓలు శ్యామ సుందరరావు, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

హామీలు సరే.. అమలు ఏదీ?

- ఆరు నెలలు గడిచినా అమలుకాని హామీలు
- ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కూటమి నాయకులు
- ప్రచారానికే పరిమితమైన అభివృద్ధి పనులు
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ చర్యలు శూన్యం



నూజివీడు పట్టణం

నూజివీడు: ఎన్నికల సమయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆరు నెలలుగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని కూటమి పాలనపై నియోజకవర్గ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారా అని నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. అభివృద్ధి పనులపై కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రచారానికే పరిమితమై కార్యరూపం దాల్చలేదని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు.

ముందుకు సాగని నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి

నూజివీడు–విజయవాడ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఇంత వరకు దానికి సంబంధించి ఏ విధమైన ముందడుగు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ రహదారిని పీపీపీ పద్ధతిలో అమలు చేస్తామని చెబుతోంది. అదే జరిగితే వాహనదారులకు, ప్రయాణికులు టోల్ బాదుడు తప్పదు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ హామీకే పరిమితం

నూజివీడు పట్టణానికి అండర్ గ్రౌండ్ సదుపాయం ఇంత వరకు లేదు. దీనిపై ఎన్నికల సమయంలో పట్టణానికి అండర్ గ్రౌండ్ సదుపాయం ఏర్పాటుకు కృషి చేస్తానని ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇంతవరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు అంచనాలు రూపొందించలేదు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అందుబాటులోకి వస్తే డ్రెయినేజీల్లో చెత్తచెదారం వేయడం, తరచుగా పూడిక తొలగించడం వంటి సమస్యలు పరిష్కారమవుతాయి.

రహదారుల విస్తరణ జరిగేనా?

నూజివీడు పట్టణంలో 70 ఏళ్లుగా రహదారులు విస్తరణకు నోచుకోలేదు. పెరిగిన జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఈ రోడ్లు నేడు సరిపోవడం లేదు. ఎన్నికల్లో గెలిపిస్తే రహదారులను విస్తరిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయినా రహదారుల విస్తరణకు ఇంతవరకు ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదు. ఇరుకు రోడ్లతో నిరంతరం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురై పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజలంతా రహదారుల విస్తరణ ఎప్పుడు చేపడతారా అని ఎదురు చూస్తున్నారు.

ఇండోర్ స్టేడియం తీరని కలేనా?

నూజివీడు పట్టణంలో పాలడుగు వెంకట్రావు ఇంటి సమీపంలో ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ పక్కన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు నిలిచిపోయి అసంపూర్తిగా దర్శనమిస్తోంది. దీనిని పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామని నేతలు చెప్పినప్పటికీ ఆరు నెలలు గడిచినా ఇంతవరకు ఒక్క అడుగ కూడా ముందుకు పడలేదు. ఆ స్థలంలో ముళ్ల కంప పెరిగిపోయింది. మున్సిపల్ నిధులతో ముళ్ల కంపను తొలగించి శుభ్రం చేశారే తప్ప ఇంత వరకు నిర్మాణ పనుల పురోగతిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ఎన్టీఆర్ జిల్లాలో కలిపేనా ?

టీడీపీ అధికారంలోకి వస్తే నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే ఆరు నెలలు గడిచినా ఇంతవరకు ఎన్టీఆర్ జిల్లాలో కలిపే ఆలోచన చేసిన దాఖలాల్లేవని ప్రజలు చర్చించుకుంటున్నారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఎప్పుడు ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అభివృద్ధి చేయాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు, రోడ్ల విస్తరణ, ఇండోర్ స్టేడియం నిర్మాణం, నాలుగు లైన్ల రహదారిగా నూజివీడు–విజయవాడ రహదారిని అభివృద్ధి చేయాలి. ఇచ్చిన హామీలను అమలు చేస్తేనే రాజకీయ నాయకులపై ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుంది.

– శీలం రాము,
వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, నూజివీడు

హామీలను నెరవేర్చాలి



ఎన్నికల ముందు నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలను మంత్రి కొలుసు పార్థసారథి నెరవేర్చాలి. ముఖ్యంగా రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలి. అధ్వానంగా ఉన్న నూజివీడు–మునునూరు రోడ్డును అభివృద్ధి చేయాలి. నూజివీడు–విజయవాడ రోడ్డును విస్తరించి, అభివృద్ధి చేయాలి.

– చాట్ల పుల్లారావు,
ఏఐటీయూసీ నాయకులు, నూజివీడు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తిరువూరు ఆర్డీఓ మాధురి



గోసవీడులో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధురి



జనార్దనవరంలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రశాంతి

గోసవీడు(గంపలగూడెం): భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తిరువూరు ఆర్డీఓ మాధురి తెలిపారు. గంపలగూడెం మండలం గోసవీడులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ పాస్ పుస్తకాలు లేని రైతులకు కొత్త పుస్తకాల మంజూరు, పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణ, ఆన్‌లైన్ తప్పుల సవరణలపై అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. తహసీల్దార్ రాజకుమారి, ఆర్ఐ వీరభద్రం, మండల సర్వేయర్ సాంబశివరావు, సర్పంచ్ కె. ప్రశాంత్, ఎంపీటీసీ జయలక్ష్మీ, వీఆర్వోలు ప్రేమ్, మదార్, జయకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

- చాట్రాయి: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ డి. ప్రశాంతి తెలిపారు. బుధవారం మండలంలోని జనార్దనవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించాలంటూ ఆరు అర్జీలు వచ్చాయని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి వెంకటరత్నం, మాజీ సర్పంచ్ పామర్తి నాగేశ్వరరావు, టీడీపీ నాయకురాలు మదాసు చంద్రకళ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలపై 70 అర్జీలు..

ముసునూరు: తొలి రోజు రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యలపై 70 అర్జీలు అందాయని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని లోపూడిలో నోడల్ అధికారి డీఎల్‌పీ సుందరి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూమి సర్వే నిమిత్తం 29, భూమి హక్కు పత్రాల (ఆర్ఓఆర్) కోసం 59, ఇతర సమస్యలపై రెండు, మొత్తం 70 అర్జీలు అందాయని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గురువారం అక్కిరెడ్డిగూడెంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి

ఏఓ చాముండేశ్వరి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి చాముండేశ్వరి

నూజివీడు: 20 రోజుల వయస్సున్న మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉనికిని గుర్తించామని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి తెలిపారు. మండలంలోని కొత్తరావిచర్ల, పాతరావిచర్లలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకు వేప కషాయంతో పాటు ఇమామెంక్టిన్ బెంజోయేట్ ఒక ఎంఎల్ లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తి, వేరుశనగ పైర్లను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. మొక్కజొన్న సాగు చేసిన రైతు ఎకరాకు రూ.483 ఫసల్ బీమా పథకంలో ప్రీమియం చెల్లించాలన్నారు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల కారణంగా పంట నష్టం జరిగితే మొక్కజొన్న పంటకు నష్టపరిహారం అందుతుందన్నారు. విత్తన మొక్కజొన్నను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా కంపెనీల నుంచి లిఖితపూర్వక ఒప్పందాలు చేసుకోవాలని చెప్పారు. ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ మాట్లాడుతూ మామిడికి ఎకరాకు రూ.2,250 చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. మామిడి కాయలకు కవర్లు ప్రతి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, 50 శాతం రాయితీపై వాటిని అందిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సతీష్, విజయ రైతులకు బయోకల్చర్, ఎమినోయాసిడ్ తయారీ, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కొత్త రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు, పట్టు పరిశ్రమ టీఏ హరిబాబు, వీహెచ్‌ఏ జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

సీపీఎం నాయకుల వినతి

మైలవరం: పేద దళితుల భూములపై పెద్దల కన్ను పడి ఆక్రమణలకు గురవుతోందని, ఆ భూమికి రక్షణ కల్పించాలని సీపీఎం మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ విజ్ఞప్తి చేశారు. మైలవరంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మైలవరం గ్రామం చిన్న దళితవాడ దళితులకు చెందిన భూ సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మైలవరంలోని సర్వే నంబర్ 321లోని 29 ఎకరాలను 11 కుటుంబాలకు 1974 సంవత్సరంలో అప్పటి ప్రధాని దివంగత ఇందిరాగాంధీ చేతుల మీదుగా పేద దళితులకు పట్టాలు ఇచ్చారని చెప్పారు. అప్పటి నుంచి భూములు సాగు చేసుకుంటున్న పేదలను బెదిరిస్తున్నారని, వారి పంటలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ఈ భూములను కొందరు పెద్దలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తహసీల్దార్ స్పందిస్తూ విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో భూ పోరాట కమిటీ కన్వీనర్ తొమ్మండ్రు అబ్రహాం, సందిపాము రమేష్, కోట సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

ఇబ్రహీంపట్నం: సాగు నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ ఎన్నికలను ఈ సారి ఖచ్చితంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. త్రిలోచనాపురం చెరువు, కవ్వులూరు చెరువు, రాయనపాడు సప్‌లై చానల్, ఈలప్రోలు గోవిందప్ప చెరువు, జమీనవే పోతవరం పెద్ద చెరువు, త్రిలోచనాపురం ఎర్ర చెరువుకు సాగు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లోని మొత్తం 3,082 మంది సభ్యులు ఎన్నికల్లో పాల్గొని సాగునీటి సంఘాల పాలక వర్గాలను ఎన్నుకుంటారని తహసీల్దార్ వివరించారు.

- గంపలగూడెం: సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఆయా సంఘాలకు సంబంధించిన ఫారాలను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. మండలంలోని చెరువులకు సంబంధించిన 15 మేజర్ నీటి సంఘాలు, నాగార్జున సాగర్ ఆయకట్టు కింద 8 మైనర్ ఇరిగేషన్ నీటి సంఘాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు.

రైతులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

- 13న నిర్వహించే నిరసన గళానికి రైతులు తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో రైతులను నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. నూజివీడులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 13న కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న నిరసన గళం పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతుల సమస్యలపై వారి పక్షాన వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని, పంటల బీమా ప్రీమియంను రైతుల నెత్తినే రుద్దుతోందని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా రైతులకు ఇస్తానన్న రూ.20 వేలు సాయంపై ప్రభుత్వం నోరు మెదడం లేదని నిలదీశారు. ఖరీఫ్ సీజన్ పూర్తయిందని, రబీ సీజన్ ప్రారంభమైనా రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర నష్టాల బారిన పడుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 13న ఏలూరులోని కలెక్టర్ కార్యాలయానికి రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పగడాల సత్యనారాయణ, నవుడు నాగమల్లేశ్వరరావు, బాణావతు రంగారావు, కోఆప్షన్ సభ్యుడు లాం ప్రసాదరావు, నాయకులు పాల్గొన్నారు.

- తిరువూరు: రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు నరెడ్ల వీరారెడ్డి , జెడ్పీటీసీ భూక్యా గనియా అన్నారు. ఎ.కొండూరు మండలం చీమలపాడులో బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుంటక శివారెడ్డి, జరబల పెదబాబు, పి. వడ్డీకాసులు, రవి పాల్గొన్నారు.
- విస్సన్నపేట: రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై ఈనెల 13వ తేదీన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్ ఎం. సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ జి. మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 13న కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే 'అన్నదాతకు అండగా' కార్యక్రమం విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య అధ్యక్షతన ఇబ్రహీంపట్నం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. 13న నిరసన కార్యక్రమంలో రైతులు, రైతు విభాగం నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎక్కడి చెత్త అక్కడే

- విధులకు పారిశుద్ధ్య కార్మికుల గైర్హాజరు
- బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్



ఆగిరిపల్లి శివాలయం వద్ద పేరుకుపోయిన చెత్త

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో మూడు రోజుల నుంచి రోడ్లపైనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు మూడు రోజుల నుంచి విధులకు హాజరు కాకపోవడంతో రోడ్లపై చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రతి నెలా 15వ తేదీ దాటిన తర్వాత జీతాలు ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల నుంచి రావలసిన బకాయిలు చెల్లించడం లేదని వారు వాపోయారు. ప్రతి నెలా 2వ తేదీన జీతాలు ఇవ్వాలని, బకాయిలు వెంటనే చెల్లిస్తేనే విధులకు హాజరవుతామని పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్‌ను వివరణ కోరగా గురువారం పారిశుద్ధ్య కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

మక్కపేట(వత్సవాయి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వ్యవసాయశాఖ ఏడీఏ సి.భవాని తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా గత 11 రోజులుగా జాతీయసేవ పథకంలో భాగంగా గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఇంటి ముందు ఉన్న సైడ్ కాలువలను శుభ్రపరుచుకుని మురుగునీరు పారేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కాలువల్లో దోమల మందు పిచికారీ చేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, కేవీకే కో ఆర్డినేటర్ అచ్చుతరాజు, శాస్త్రవేత్తలు వి.సీతారాంబాబు, ఎన్.జస్వంత్‌రెడ్డి, ఎస్.రాజశేఖర్, జి.శోభితారాణి, శివప్రసాద్, ప్రభావతి పశువైద్యాధికారి కె.శ్రీరాములు, కొండబోలు బ్రహ్మం పాల్గొన్నారు.

ఎల్‌హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ కేంద్రం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం తెలిపారు. శిక్షణా కేంద్రంలో చేరేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎస్ఎస్‌సీ ప్లస్ 2, డిగ్రీ ఆపైన ఉత్తీర్ణులై ఉండాలని, డిసెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అభ్యర్థులకు ప్రత్యేకంగా మూడు నెలలు డమెస్టిక్ బయోమెట్రిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు డేటా ఎంట్రీ కోర్సులలో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

20న నూజివీడులో జాబ్‌మేళా

నూజివీడు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూజివీడులో ఈనెల 20న మెగా జాబ్ మేళా నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా భారీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆడిటోరియంలో ఈ మేళాను నిర్వహిస్తారన్నారు. దాదాపు 40 కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని వేర్వేరు ఉద్యోగ అర్హతలు ఉన్న యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు.

పంటల బీమాతో రైతులకు ప్రయోజనం

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేయించుకోవాలని, దీంతో అధిక ప్రయోజనం పొందవచ్చని ఏడీఏ జి.విద్యాసాగర్ బుధవారం తెలిపారు. దీనివల్ల తుపాను, కరువు, అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందుతుందన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించిన రైతులు, కౌలు రైతులకు బీమా వర్తిస్తుందని చెప్పారు. వరి పంటకు ఎకరాకు రూ.500, మొక్కజొన్నకు ఎకరాకు రూ.483, మినుములు ఎకరాకు రూ.60 ప్రీమియం చెల్లించాలన్నారు. వరి పంటకు ప్రీమియం చెల్లించేందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉండగా, మొక్కజొన్న, మినుము పంటలకు సంబంధించి ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15తో గడువు ముగియనుందని ఏడీఏ వివరించారు.

సారా కేసుల్లో ముగ్గురు బైండోవర్

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రెడ్డిగూడెం మండలానికి చెందిన ముగ్గురు నిందితులను రెడ్డిగూడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో చాట్ల బండయ్య, గద్దల రమాదేవి, మల్లాది ఏసు ఉన్నారన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

మైలవరం: మైలవరం మండలం కొత్తగూడెం పాల కేంద్రంలో కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా 248 మంది పాడి రైతులకు బుధవారం బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, వేతన కార్యదర్శి బి. వెంకటరెడ్డి, సూపర్ వైజర్ వి. సురేష్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

- తిరువూరు: తిరువూరు క్లస్టర్ పరిధిలోని లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో పాడి రైతులకు బుధవారం బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్లు బొట్టు రామచంద్రారావు, బోయపాటి సుశీల, ట్రస్ట్ సభ్యులు ఎం. విజయలక్ష్మి, పి. సత్యనారాయణ, ఏజీఎం అన్వేష్, మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: అంతర్ రాష్ట్ర జానపద, వెస్టన్ నాట్య పోటీల్లో స్థానిక శ్రీ శారదా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఇజ్రాయేల్ తెలిపారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని స్టెప్ అప్ డ్యాన్స్ అకాడమీ 14వ వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన నృత్య పోటీల్లో శారదా స్కూల్ విద్యార్థులు పాల్గొని జానపద నాట్యంలో ప్రథమ స్థానం, వెస్టన్ డ్యాన్స్‌లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను సంస్థ చైర్మన్ శంకరరావు తదితరులు అభినందించారు.